క్లుప్తంగా

పుట్ట బంగారు మహోత్సవం నేడు



బొర్రమాంబ అమ్మవారు

అగనంపూడి: అగనంపూడి పరిసర 8 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి పుట్ట బంగారు మహోత్సవం గురువారం సాయంత్రం జరిపించేందుకు ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. అమ్మవారు వనం నుంచి గ్రామంలోకి ప్రవేశించే సమయంలో భారీ స్థాయి బళ్ల వేషాలు, మేళ,తాళాలతో ఊరేగింపు చేపట్టనున్నట్టు కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ తెలిపారు.

పేదలకు చీరలు, తువాళ్ల పంపిణీ



పేద మహిళలకు చీరలు, తువాళ్లు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలు, తువాళ్లు పంపిణీ చేశారు. అగనంపూడి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు దంపతుల ఆర్థిక సహకారంతో 20 మంది వృద్ధ, నిరుపేద మహిళలకు చీరలు, తువాళ్లు, నిత్యావసర సరకులు అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారుడు పట్టా రామ అప్పారావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థికి పతకం



సునీల్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అగనంపూడి: జోన్–1 బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి షణ్ముఖ వెంకట సునీల్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ నెల 26వ తేదీన కాకినాడ గోల్డెన్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 16 జిల్లాలకు చెందిన బాడీ బిల్డర్లు పోటీల్లో పాల్గొనగా, సునీల్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. ఈ మేరకు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సునీల్‌ను కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వ్యాయామ విద్య అధ్యాపకులు సీహెచ్.రాంబాబు, జె.ప్రశాంత్. పి.ఎస్.వి.రమణ, భారతి అభినందించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపులకు అవకాశం

గాజువాక: శ్రీరామ నవమి రోజైన గురువారం కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. గాజువాకలోని ఈఆర్వో కేంద్రంలోను, పెదగంట్యాడలోను ఈ కేంద్రాలు ఉదయం పది గంటలనుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. బిల్లు చెల్లింపుదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

అగనంపూడి/పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జీవీఎంసీ 76వ వార్డు, 85వ వార్డు అగనంపూడిలోని ఎన్టీఆర్ పార్కు, 69వ వార్డు శీలానగర్‌లలో నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. శీలానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గోపాలరాజు, ఎం.నిర్మలకుమారిలను సన్మానించారు. కార్యక్రమాల్లో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ అధికార ప్రతినిధి నెల్లి, 69వ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం

- ఉక్కునగరంలో ఔషధాల ఆరోగ్య వనం
- ఆకట్టుకుంటున్న వాకింగ్ ట్రాక్, యోగా కుటీరం



ఔషధ మొక్కల ప్రాముఖ్యత తెలిపే బోర్డు



పార్కులోని వాకింగ్ ట్రాక్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కోసం యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆరోగ్యవనం ఉక్కునగరవాసులకు బహుళ ప్రయోజనకారిగా ఉంది. వాకింగ్‌కు వచ్చే వారు ఔషధ మొక్కల నుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ, ఆహ్లాదాన్ని పొందుతున్నారు. వ్యాయామం, యోగాభ్యాసాలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఉక్కునగరంలో దాదాపు అన్ని సెక్టార్లలో పార్కులను ఏర్పాటు చేసిన యాజమాన్యం త్రిష్టా మైదానంలో సుమారు రూ. 5 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను కూడా నిర్మించింది. అన్నింటిలో ఈ పార్కు ప్రత్యేకంగా నిలిచింది.

32రకాల ఔషధ మొక్కలతో..

ఉద్యోగులకు ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు వాతావరణ కాలుష్యం నుంచి ఉపశమనాన్ని అందించేందుకు ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఆరోగ్యవనాన్ని ఏర్పాటు చేశారు. అందులో వాకింగ్‌కు వచ్చే వారి ఆరోగ్యార్థం మామిడి, నేరేడు, మారేడు తదితర 32రకాల ఔషధ మొక్కలు అక్కడ నాటారు. వాటి ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఏ వ్యాధి ఉన్నవారికి ఏ మొక్క నుంచి వచ్చే గాలి బాగా ఉపయోగపడుతుందనే విషయాన్ని వివరంగా తెలియజేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగుల కోసం ఇసుక, మట్టితో కూడిన రెండు వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. పార్క్‌కు వచ్చేవారు యోగా చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక కుటీరాలను ఏర్పాటు చేశారు. దీంతో చాలా మంది ఉక్కునగర వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆరోగ్యవనంలో వాకింగ్‌తో పాటు వ్యాయామాలు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ షిఫ్ట్ నుంచి వెళ్లే ఉద్యోగులు డ్యూటీ నుంచి సరాసరి పార్క్‌కు వెళ్లి వాకింగ్ చేస్తున్నారు. పార్క్‌లో విద్యుత్ లైట్లు కూడా ఏర్పాటు చేయడంతో కాస్త చీకటిపడినా ఇబ్బంది ఉండటం లేదని పార్క్‌కు వచ్చేవారు చెబుతున్నారు.



ఆరోగ్యవనం

ఈ వనం ప్రత్యేకం

పార్కులు అన్ని చోట్లా ఉంటాయి. అయితే ఔషధ మొక్కలతో కూడిన పార్కు ఆరోగ్యవనం ఒక్కటే. ఈ పార్కులో మట్టి ట్రాక్‌తో పాటు ఇసుకతో కూడిన ట్రాక్ ఏర్పాటు చేయడం బాగుంది.ఔషధాల నుంచి వచ్చే గాలిని పీలుస్తూ, వాకింగ్ ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్నాం. అందుకే రోజూ వస్తాం.
–బి.చిరంజీవి తేజ, ఉక్కునగరం యువకుడు

సంక్షేమ సారథి సీఎం జగన్

- విశాఖ అభివృద్ధికి ఎనలేని కృషి
- ఎమ్మెల్యే నాగిరెడ్డి వెల్లడి
- 68వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం



మిందిలో మహిళకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: పేదల సంక్షేమానికి ఎంతో తపన పడుతూ, అందుకు అనుగుణంగా ఎన్నో పథకాలనందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమ సారథిగా ప్రజల మన్ననలు అందుకుంటున్నారన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 68వ వార్డు మింది సచివాలయ పరిధి మిందిలో కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ విశాఖను పరిపాలనా రాజధానిగా చేయడమే కాకుండా, అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేయడమే జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 ద్వారా రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులతో 340 ఒప్పందాలు చేసుకుని నిరుద్యోగులకు 6 లక్షల ఉద్యోగాలు కల్పించిన గొప్ప నాయకుడు జగన్ అన్నారు. విశాఖలో జి–20 సన్నాహక సదస్సును నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన యువ ముఖ్యమంత్రి అని కొనియాడారు. చంద్రబాబు విశాఖను నిర్లక్ష్యం చేశాడని, జగన్ విశాఖను ప్రపంచంలోనే అన్ని రంగాల్లో అనువైన నగరంగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, గుర్రం రాజేష్, నంబారు రాజు, శ్రీహరి, ఈటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రప్రభుత్వం బాధ్యతను విస్మరించడం దుర్మార్గం'

- కార్పొరేటర్ గంగారావు
- ఈవోఐకు వ్యతిరేకంగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ప్రజా సంపద అయిన స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం దుర్మార్గమని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ఇటీవల ఉక్కు యాజమాన్యం ముడిసరకు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన చేయడానికి నిరసనగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలంటూ యాజమాన్యం స్థానిక కార్మిక సంఘాలతో చర్చించకుండా ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసేలా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ఉక్కుశాఖా మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. యాజమాన్యం వెంటనే ఆ ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.టి. దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, డి. సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారాన్ని ప్రదర్శించి వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

పెదగంట్యాడ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పాలవలస అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా, పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పోషకాహారాలను ప్రదర్శించారు. ఆ ఆహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. చిన్నారులకు కూడా మంచి ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రహదారిలో స్కూటీని వెనుక నుంచి ట్రాలర్ ఢీకొన్న ఘటనలో స్కూటీపై వెనుక కూర్చున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి. శ్రీహరిపురం ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన పెద్దపల్లి సందీప్ (23) సీఎన్‌సీ మెషినరీ కోర్సు అభ్యసిస్తున్నాడు. బుధవారం తన స్నేహితులతో పాత గంగవరం బీచ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తూ.. బీసీ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ నుంచి యు టర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాలర్ స్కూటీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెనుక కూర్చున్న సందీప్ కుడికాలి మడమ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి వీడ్కోలు



నాగేశ్వరరావును సత్కరిస్తున్న డీజీఎం, సహోద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం ఉద్యోగి పెద్దాడ నాగేశ్వరరావుకు సహోద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. కోక్‌ఓవెన్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.ఎన్. జగన్నాధరావు ముఖ్య అతిథిగా హాజరై నాగేశ్వరరావును సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు 41 సంవత్సరాలు సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించి, విభాగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కె.వి.ఎ.బాబ్జీ, ఎం.వి.వి.సత్యనారాయణ, కె.పిన్నయ్య, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయ రేపు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఫీడర్ 33/11 శీలానగర్ ఎస్ఎస్‌లో విద్యుత్ వైర్లకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

'చలో ఢిల్లీ'పై విస్తృత ప్రచారం

గాజువాక: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల సర్వీసుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు తదితరులు వివిధ వార్డుల్లోని శానిటరీ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహించారు.

'హామీలు నెరవేర్చాలి'

ఉక్కునగరం: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) స్టీల్ సిటీ డిపో అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ రీజనల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జరిగిన గేటు మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు జి. ఈశ్వరరావు, ఎ.వి.రమణ, ఎస్.వై. నిర్మల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలి



జాతీయ ఉత్పాదక మండలి డైరెక్టర్ శరవణన్‌తో ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుకు కృషి చేయాలని న్యూఢిల్లీలోని జాతీయ ఉత్పాదక మండలి డైరెక్టర్ శరవణన్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులకు మండలి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్పాదక మండలి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థల్లోని ఉద్యోగులకు నిర్వహిస్తున్న అవగాహన తరగతుల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను తెలిపారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ జోగారావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షులు బి. తొడన్న, ఎస్.సత్యనారాయణ, డి.పుల్లారావు, ఎస్.మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: 75వ వార్డు శీకువానిపాలెంలోని నూకాంబిక ఆలయ 5వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు.అమ్మవారికి విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మ వారికి సమర్పించే సారెను భక్తులు ఊరేగించారు. సాయంత్రం జాతర నిర్వహించారు.

'కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదు'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల పోరాట పటిమకు కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 776వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎం.ఎం.ఎస్.ఎం, ఎస్.టి.ఎం కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మేస్తానని కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి వేళాయె..

- ముస్తాబైన రామాలయాలు
- ఏర్పాట్లలో కమిటీలు నిమగ్నం



అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

అక్కిరెడ్డిపాలెం: సీతారాముల కల్యాణ మహోత్సవానికి రామాలయాలు ముస్తాబవుతున్నాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని, గురువారం జరిపించనున్న పరిణయ వేడుకను వీక్షించేందుకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో సీతారాముల పరిణయ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొనున్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడ అప్పన్న కాలనీ, 69వ వార్డు నాతయ్యపాలెం, తుంగ్లాం, హరిజన జగ్గయ్యపాలెంలోని రామాలయాల్లో కల్యాణ వేడుకకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీల ప్రతినిధులు సన్నాహాలు చేశారు.



పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్న కమిటీల ప్రతినిధులు

ఘనంగా రాములోరి పెళ్లిరాట

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామంలో సీతారాముల ఆలయంలో పందిరి రాట మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని గురువారం ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపించనున్నట్లు ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

భజన తాళాల పంపిణీ

అగనంపూడి నిర్వాసిత కాలనీల్లోని పలు భజన బృందాలకు భజన తాళాలను కానుకగా అందించారు. అమెరికా నివాసి కంచర్ల కృష్ణ కుమార్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఈ భజన తాళాలను ఉక్కు రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎస్.ఎల్.పి.రావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఎస్.సన్యాసిరావు, పెద అప్పారావు, ఐఆర్‌సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా దయాల్‌నగర్ ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే పాఠశాలలే దేవాలయాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో గల మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) పాఠశాల 25వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆటలు, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటరమణ, సీహెచ్ సర్వలక్ష్మి, పీఎస్ఎన్ జ్యోతి, ఎం.రత్నమణి, వీడీఎల్ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను ఉపాధ్యాయులు సత్కరించగా, ఉపాధ్యాయులను కార్పొరేటర్ సత్కరించారు.

ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో 110 మంది ఉత్తీర్ణత



విద్యార్థులతో ఉపాధ్యాయులు

గాజువాక: ఇటీవల నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) లెవల్–2 పరీక్షల్లో శ్రీచైతన్య టెక్నో స్కూల్ పాతగాజువాక బ్రాంచ్‌కు చెందిన 110 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఏడుగురు విద్యార్థులకు ఒకటి నుంచి ఐదు స్థానాలు, ఆరుగురు విద్యార్థులకు స్వర్ణ పతకాలతో కూడిన ప్రత్యేక బహుమతులు, 16 మంది కన్సొలేషన్ బహుమతులు, 53 మందికి మెరిట్ సర్టిఫికెట్లు లభించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

సీఎంఎం విభాగాధిపతికి అభినందనలు



నూతన విభాగాధిపతి గణేష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధిక ఉత్పత్తి సాధించే దిశగా ఉద్యోగులందరూ శ్రమించాలని స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) జనరల్ మేనేజర్ గణేష్‌కుమార్ కోరారు. సీఎంఎం నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఆయనను కలిసి శాలువా కప్పి, బొకేతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుకు అధిక ఉత్పత్తి సాధించడం ఆవశ్యమన్నారు. అంతకు ముందు ఐఎన్‌టీయూసీ నాయకులు విభాగం కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కార్యదర్శి పి.ఎస్.వి.ఎన్. గోపాల్, నాయకులు వాసు, బి. స్వామినాథం, వి.వి.శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



హర్షవర్ధన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌నకు చెందిన ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రామకుమార్ కుమారుడు జి. హర్షవర్ధన్ (18) స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కెమిస్ట్రీ పరీక్షకు వెళ్లాల్సిన హర్షవర్ధన్ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు లేచి, చదవడానికి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి వెళ్లి వాకబు చేయగా హాజరు కాలేదని తెలిసింది. చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావును 94407 96015 నంబర్‌లో గానీ లేదా విద్యార్థి తండ్రిని 91215 69942 నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: పేదల అవసరాన్ని గుర్తించి, వారికి సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు పిలుపునిచ్చారు. వార్డు పరిధిలోని గిరిజా కాలనీలో గల సామాజిక భవనం వద్ద సీఎల్సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పేదల కోసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో సీఎల్సీ సంస్థ సేవలను కొనియాడారు. బిషప్ మహంతి, ఆల్ఫ్రెడ్ మహంతి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు డాక్టర్ కేఎస్‌పీఏఎస్ రాజు, డాక్టర్ నితీష్ వర్మ, డాక్టర్ దేవీ వేగేశ్న, డాక్టర్ కె.రవితేజ, డాక్టర్ మహేష్, డాక్టర్ టీఎస్ నాయుడు తదితరులు రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మంగునాయుడు, దేముడు, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.